

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - బలిజిపేట



పాఠశాల క్రీడల్లో భాగంగా గుంటూరు జిల్లా పల్నాడులో ఈనెల 13 నుంచి 16 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-14 పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానాన్ని (గోల్డ్ మెడల్) సాధించింది. ఈ జట్టులో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న గణేష్ అత్యంత ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని పిఇటిలు టి.పరుశురాం, యు.సురేష్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన గణేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాలిపోతున్న పసిమొగ్గలు

- అనారోగ్యంతో గిరిజన విద్యార్థుల మృత్యువాత
- పౌష్టికాహార లోపం... అరకొర వైద్య సదుపాయం
- గిరిజన వసతిగృహాల్లో విద్యార్థుల దుస్థితి



మృతి చెందిన గిరిజన విద్యార్థిని పవిత్ర (ఫైల్)

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో ఇటీవల అనారోగ్యంతో గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు గిరిజన విద్యార్థులు అనారోగ్య బారిన పడి మృతి చెందారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో కొత్తూరు మండలం పూతిక వలస గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కొండగొర్రి పవిత్ర సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందింది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుమిత్ర, మక్కువ కెజిబివి పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న కొండగొర్రి యోగీశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. పది రోజుల వ్యవధిలో ముగ్గురు గిరిజన విద్యార్థులు చనిపోవడం బాధాకరం. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందకపోవడం, పౌష్టికాహార లోపం కారణాల విద్యార్థులు చనిపోయారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులు మరణిస్తున్న ఇటు ఐటిడిఎ అధికారులు, అటు ప్రభుత్వం మరణాల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆదివాసీల ఆరోగ్యం కనుమరుగు

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్థానికంగా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యా సంస్థలు మొదలుకొని కెజిహెచ్ వరకు హెల్త్ వాలంటీర్లను నియమిం చింది. ఆశ్రమ పాఠశా లలు, ఆసుపత్రుల్లో సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించింది. దీంతో పాటు ఐటిడిఎలో ఒక వైద్యాధికారి, మోనటరింగ్ అధికారి ఉండేవారు. సీరియస్ కేసులను ఇక్కడ నుంచి విశాఖ కెజిహెచ్ కు తరలించే బాధ్యత వహించేవారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్యసేవలు అందడంతో మరణాలు కొంతవరకు అదుపులో ఉండేవి. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో పరిస్థితి తలకిందు లైంది.

వైద్య సేవలు అంతంత మాత్రమే

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడడంలేదు. వైద్యం కోసం వెళుతున్న విద్యార్థులకు సాధారణ పరీక్షలతోనే సరిపెడుతున్నారు. వ్యాధి ముదిరి ఆ విద్యార్థి మరణానికి కారణమవుతోంది. సక్రమంగా వైద్య సేవలు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాక్ష్యాత్తు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సొంత జిల్లాలో గిరిజన విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఒకవైపు ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, గిరిజన వసతి గృహాల్లో పరిస్థితికి ఏమాత్రం పొంతన ఉండడం లేదు. ప్రతి ఏటా పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో పౌష్టికాహార లోపం, అనారోగ్యంతో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా సకాలంలో ప్రజాప్రతినిధులుగాని, అధికారులు గాని స్పందించడం లేదు. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందక, పౌష్టికాహారం లోపం, ఇతర కారణాలవల్ల గిరిజన విద్యార్థులు పసిప్రాయంలోనే మృత్యు ఒడికి చేరుతున్నారు. ఉన్నత చదువులు చదవాలని, ఉద్యోగం చేసి తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలని కలలుగన్న ఆ గిరిజన విద్యార్థులు కలలు కలగానే మిగిలిపోతున్నాయి.

పెరగని మెనూ ఛార్జీలు.. అందని పౌష్టికాహారం

రోజురోజుకు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ విద్యార్థులకు పెడుతున్న భోజనానికి ఛార్జీలు పెంచక పోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందడం లేదు. మరోవైపు మెస్ బిల్లులు నెలల తరబడి పెండింగ్ లో ఉండడంతో వసతి గృహ సంరక్షకులకు భారంగా మారింది. సొంత డబ్బులు పెట్టుకుని, చాలని పరిస్థితుల్లో అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు అందించే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఆశ్రమ పాఠశాలలు, వసతి గహాల్లో వంట చేసేందుకు సిబ్బంది కొరత ఎక్కువగా వెంటాడుతుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఐటిడిఎ అధికారుల దష్టి సారించాలి. ప్రభుత్వ నాడు-నేడు పనులకు ఇస్తున్న ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్యానికి ఇవ్వడం లేదు. వైద్యం అందక సకాలంలో విద్యార్థులు చనిపోతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

మండంగి రమణ
ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు



విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు (ఫైల్)

వైద్య సేవలు కరువు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య సేవలు అందడం లేదు. గతంలో పనిచేసిన హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం తొలగించడంతో సేవలు కురువయ్యాయి. మరోవైపు విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు స్పందించాలి.

- పల్లా సురేష్ గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైతుల సమస్య పరిష్కారం

చలివేంద్రి రైతులపై కేసులు ఎత్తివేత

ప్రజాశక్తి- పార్వతీపురం, వీరఘట్టం

వీరఘట్టం మండలం చలివేంద్రి రైతుల సమస్య పరిష్కారమైంది. గురువారం ఆ గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులంతా అడ్డుకున్న విషయం తెలిసిందే. అయితే రైతులు తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా అడ్డుకున్నారంటూ కలెక్టర్ సిఫార్సు చేయడంతో పోలీసులు పలువురు రైతులపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చలివేంద్రి రైతులు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్‌లను కలుసుకున్నారు. తమపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం నిల్వల పరిశీలనకు జిల్లా వ్యవసాయ అధికారి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ను శుక్ర వారం ఉదయమే పంపించి మొత్తం తీసుకురావాలని ఆదేశించామని తెలిపారు. ఈ మేరకు ఇద్దరు అధికారులు గ్రామానికి వచ్చారని, ధాన్యం సేకరణ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 'ప్రతి కుటుంబంలో నేను ఒక సభ్యునిగా భావిస్తున్నా'ని చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని వచ్చామన్నారు. జిల్లాలో మారుమూల గ్రామాల్లో పర్యటించానని, ప్రతి గ్రామంలో ఏదో ఒక సమస్య ఉందని, వాటిని పరిష్కరించేందుకు శక్తి మేరకు కృషి చేస్తున్నామని తెలిపారు. సేవలు అందించేం దుకు సహకరించాలని కోరారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంకు జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, జాయింట్ కలెక్టర్ ల కార్యాలయాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, చలివేంద్రి రైతులు ఎ.కృష్ణం నాయుడు, ఎల్.రాము, జి.ఎన్ రామకృష్ణ, బి.రమణ నాయుడు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేత

రైతులపై పెట్టిన కేసులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఎత్తివేసినట్టు సిఐకె.మురళీధర్ తెలిపారు.

రైతులు ఎవరైనా ఒక్కటే : సివిల్ సప్లై డిఎం

వీరఘట్టం: రైతులు ఎవరైనా ఒక్కటేనని, వారి వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై డిఎం దేవుళ్ల నాయక్ అన్నారు. మండలంలోని చలివేంద్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం చలివేంద్రిలో 5వేల బస్తాల ధాన్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని తరలించేందుకు ఐదు లారీలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఏ ఒక్క రైతు పేరు తప్పిపోకుండా వారి వివరాలు ఆన్లైన్లో పొందుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ గ్రామంలో ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో దశల వారీగా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట వ్యవసాయశాఖ జెడి కె.రాబర్ట్‌పాల్, ఎడిఎ రత్నకుమారి, పార్వతీపురం, వీరఘట్టం మండలాల వ్యవసాయ అధికారులు ఎం.అశోక్, కె.మన్మథరావు, ఎఇఒ బి.కృష్ణకాంత్ ఉన్నారు.

ఏనుగులకు శాశ్వత పరిష్కారం అవసరం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను శాశ్వతంగా జూకు గానీ, సంరక్షణ కేంద్రాలకు గాని తరలించి ప్రజల ప్రాణ, పంట నష్టాలను తగ్గించాలని కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మ వలస, పార్వతీపురం మండలాల సర్పంచులు కోరారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఆధ్వర్యంలో కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మ వలస, పార్వతీపురం మండలాల గ్రామ సర్పంచుల సమావేశం శుక్ర వారం జరిగింది. పంట నష్టాలను సకాలంలో చెల్లించాలని, మనుషుల ప్రాణ నష్టానికి సంబంధించిన నష్టపరిహారాన్ని రూ.ఐదు లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, పంటల బీమా సౌకర్యం కల్పిస్తూ పంటలను దాచుకొనుటకు వీలుగా కోల్డ్ స్టోరేజ్ లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. పంట మార్పులను కోరగా ప్రస్తుతం ఉన్న పంటలు అరటి, చెరుకు, వరి, కూరగాయ పంటల వలన అధిక లాభాలు వస్తున్నాయని వాటిని మార్పు చేయడం వల్ల నష్టపోతామని తెలిపారు. డిఎఫ్ఒ జిఎపి ప్రసూన మాట్లాడుతూ సూచనలను ఉన్నత అధికారులకు ప్రతిపా దిస్తామని చెప్పారు. అటవీ రేంజ్‌అధికారులు, త్రినాధ రావు, రాజాబాబు, మనికంటేష్, ఇతర సిబ్బంది హాజరయ్యారు.

కిమ్మిలో ఏనుగుల సంచారం

వీరఘట్టం : కిమ్మి-నడుకూరు గ్రామాల మధ్య శుక్రవారం గజరాజులు తిష్టి వేశాయి. ఈనెల 16న విజయనగరం జిల్లా వంగర మండలంలోని తలగంలో సంచరించిన గజరాజులు శుక్రవారం నాగవళి నదిని దాటుకుని వీరఘట్టం మండలంలోకి ప్రవేశించాయి. ఏనుగులు సంచరిస్తున్నందున ప్రజలు, రైతులు పంట పొలాలకు వెళ్లొద్దని, అప్రమత్తంగా ఉండాలని స్థానిక అటవీశాఖ రేంజర్ బి.రవిబాబు ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం వీటి కదలికల గురించి తెలిపేందుకు ట్రాకర్లు నియమించామన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

వసతిగృహాల్లో విద్యార్థులకు పెడుతున్న భోజనం ప్రభుత్వం ఇచ్చిన మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు ఆదేశించారు. శుక్రవారం సీతంపేటలో గల పలు గిరిజన ఆశ్రమ పాఠశాలలను, కళాశాలలను తనిఖీలు చేశారు. తొలుత స్థానిక బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం మెనూను పరిశీలించారు. అనంతరం సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ మరుగుదొడ్లు పరిశీలించారు. రికార్డులు తనిఖీలు చేపట్టారు. స్టాక్ రూమును, అందులో ఉండే కూరగాయలను పరిశీలించారు. రికార్డులను, మెనూ చార్టును చూశారు. అనంతరం హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పారిశుధ్యం మెరుగుపడాలని, మెనూ పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే విద్యార్థుల చదువు, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ఇకపై తరచుగా తనిఖీలు చేపడతామన్నారు. ఆయనతో పాటు మన్యం డిడి సూర్యనారాయణ, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ప్రిన్సిపల్ సూర్యకుమారి, తిరుపతిరాజు, విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు లిల్లీ రాణి, వసతిగృహ సంక్షేమాధికారి పి.అమల, హెచ్ఎంలు చంద్రరావు, ఉమావాణి, ఎఎంఒ పి.కోటబాబు, జిసిటి ఒ.రాములమ్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వండుతున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి సన్యాసినాయుడు

19న యుటిఎఫ్ జిల్లా సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈనెల 19న యుటిఎఫ్ నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కెపిఎం ఉన్నత పాఠశాలలో జరిగిన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు లయన్స్ కల్యాణ మండపంలో తొలుత "ఉపాధ్యాయులపై దాడి - మన కర్తవ్యం, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హామీలపై ప్రభుత్వ వైఖరి" అనే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీన్ని ఉపాధ్యాయులు, ఉద్యోగులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ రవీంద్ర హాజరౌతారని, కావున పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వి.పార్వతీశ్వరరావు, కోశాధికారి ఎస్.వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్ డి.పోలినాయుడు, ప్రధానోపాధ్యాయులు వై.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్టమైన భద్రత ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మహా శివరాత్రి సందర్భంగా వేలకొలది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున పోలీస్ శాఖ కూడా అంచనాలకు తగ్గట్టు సుమారు 400 మంది పోలీస్ సిబ్బందితో జిల్లాలోని అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేశామని ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియపారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అదే సమయంలో వీఐపీలకు కూడా తగిన సమయం కేటాయించామన్నారు. ఆ సమయంలోనే వారు దర్శనానికి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలాగే ఊరేగింపు సమయంలో మాడవీధుల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వాహనాల పార్కింగ్, దారి మళ్లింపు ఉన్న ప్రతి చోటా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ఎంట్రీ, ఎగ్జిట్ గేటుల వద్ద భక్తులకు సమాచారం. పూర్తిగా తెలిసేలా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి, రెవెన్యూ యంత్రాంగం, దేవాదాయ శాఖ ప్రోటోకాల్ సిబ్బంది, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల వారితో సమన్వయం చేసుకుంటూ పోలీసు శాఖ విధులు నిర్వర్తిస్తుందని తెలిపారు.

ఇష్టారాజ్యంగా అనధికార లేఅవుట్లు

- పన్నులకు ఎగనామం
- నిబంధనలకు పాతర

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో భూమి విలువ పెరగడంతో లక్షల్లోనే వ్యవహారాలు జరుగుతున్నాయి. దీంతో భూమి క్రయ విక్రయాలు జరుపుకొని అనధికార లేఅవుట్లు, నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములుగా మార్చితే నాలా చెల్లించి ఆయా పంచాయతీ అనుమతి పొందాల్సి ఉన్నప్పటికీ ఆ విధంగా ఎవరూ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఇదెక్కడో కాదు నగర పంచాయతీ పరిధిలోనే ఎక్కువ శాతం కనిపిస్తుంది. అడిగిన వారు లేరనా... అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారో తెలీదు. వ్యాపారులు మాత్రం ఇష్టారాజ్యంగా భూముల క్రమవిక్రయాలు జరిపి పనులు చేపడుతున్నారు. వీరఘట్టం రోడ్డులో దాదాపు 10 ప్రాంతాల్లో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి నిర్మాణాలు చేపట్టినట్టు తెలుస్తోంది. కనీసం ఒక్కరూపాయి కూడా నాలా చెల్లించలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా నగర పంచాయతీ అనుమతి కూడా పొందలేదని తెలుస్తోంది. లక్షల్లో వ్యాపారాలు చేసుకుని నిర్మాణాలు చేపడుతున్న వారు నిబంధనలకు పాతర వేసి ఈ విధంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి పనులు చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు భూములు కొనుగోలు చేసి మట్టిపోసి రాళ్ళ వేసి అనధికారికంగా విక్రయాలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ లేఅవుట్లుకు ఉండాల్సిన నిబంధనలే లేకుండా వ్యాపారాలు చేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

పరిశీలిస్తాం: పి.సోమేశ్వరరావు, తహాశీల్దార్....

నాలా చెల్లించని భూములను పరిశీలిస్తాం. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా నిర్వహిస్తే నాలా చెల్లించాల్సి ఉంది. విఆర్ఒలతో సమావేశం ఏర్పాటు చేసి వీటిపై నిఘా పెట్టాలని ఆదేశాలు జారీ చేస్తాం.



వీరఘట్టం రోడ్డులో చదును చేస్తున్న భూములు

సాంకేతిక నైపుణ్యం సాధించాలి : కలెక్టర్

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు10 ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించి సైన్స్, సాంకేతికరంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ డివిఎంఎం. పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సైన్స్, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను పెంచుతాయని తెలిపారు. తాను కూడా హైస్కూలు చదువుకొనేటప్పుడు జిల్లాస్థాయిలో మొదటి స్థానం, జోధ్‌పూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొని నాలుగో స్థానం పొందినట్లు తెలిపారు. ఇటువంటి ప్రదర్శనల్లో పాల్గొని ప్రాజెక్టును వివరించడం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యారంగంలో నేడు అనేక మార్పులు వచ్చాయని, సాంకేతికత అందుబాటులోనికి వచ్చిందని, యాప్ ద్వారా నూతన విద్యాబోధన అందజేసేందుకు 8వ తరగతి నుండే ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను వారు రూపొందించిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో అయిదు అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శన పెట్టగా జిల్లాలోని 15 మండలాల నుంచి పర్యావరణహిత వస్తువులు తయారీపై 14 ప్రాజెక్టులు, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై 14 ప్రాజెక్టులు, సాంకేతికత, యాప్‌లు అన్న అంశంపై 12, పర్యావరణ మార్పులపై 14, మోడలింగు మేథమెటిక్స్‌పై 14 ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రాజెక్టుల ఎంపిక

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఎంపికైన పది ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పంపించనున్నట్లు డిఇఒ రమణ తెలిపారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 75 ప్రాజెక్టులతో 150 మంది విద్యార్థులు, 150 మంది గైడ్ చేసిన ఉపాధ్యాయలు పాల్గొన్నారని తెలిపారు. ప్రతి అంశానికి ఎంపిక చేసిన రెండు ప్రాజెక్టులకు ఈనెల 27న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానికి ప్రదర్శనకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పర్యావరణహిత వస్తువుల తయారీపై చేపట్టిన ప్రాజెక్టులలో మొదటి స్థానం టి. సుష్మ (జిల్లా పరిషత్ హైస్కూలు, జి.ఎల్.పురం), రెండో స్థానం ఎం.అమృత (గవర్నమెంటు బాలికల పాఠశాల, పార్వతీపురం) నిలిచారన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై ప్రాజెక్టులో మొదటి స్థానం పి.గీతాంజలి (జెడ్‌పిహెచ్ స్కూలు, విక్రమపురం), రెండవ స్థానం సిహెచ్.జోత్న్న (జెడ్.పి.హెచ్ స్కూలు, కొత్తవలస), సాంకేతికత, యాప్‌లు అన్న అంశంపై ప్రాజెక్టులో మొదటి స్థానం జి.మనోజ్ (జెడ్‌పిహెచ్ స్కూలు), రెండవ స్థానం ఎం.విజయలక్ష్మి (జెడ్.పి.హెచ్.స్కూలు, మక్కువ), పర్యావరణ మార్పులపై ప్రాజెక్టులో మొదటి స్థానం పి.భావనకతి (జెడ్‌పిహెచ్ స్కూలు, కొత్తవలస), రెండవ స్థానం బి.యోగశ్రీ, మోడలింగు మ్యాథ్‌మెటిక్స్ ప్రోజెక్టులో మొదటి స్థానం ఎస్.అక్షితకుమార్ (జెడ్.పి.హెచ్.స్కూలు, బందలుప్పి) రెండో స్థానం సిహెచ్.దేవిక (ఎ.పి.ఎం.స్కూలు, భామిని) ఎంపికయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి 5 అంశాలపై గత నవంబరు మొదటి వారం నుంచి పాఠశాల స్థాయి నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో 5 వేల ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారన్నారు. మండల స్థాయిలో 800 ప్రాజెక్టులు పాల్గొనగా, వాటిలో మండలానికి 5 ప్రాజెక్టులు చొప్పున 75 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిని ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

ప్రజాశక్తి
www.prajasakti.com

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మద్దతుగా ప్రచారం

కొమరాడ : పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు వెళ్లి పిడిఎఫ్ ఎమ్మెల్సీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. రమా ప్రభకే మొదట ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.


గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కృష్ణ ప్రసాద్

కిలో చింతపండు రూ.32.40

గుమ్మలక్ష్మీపురం : స్థానిక గిరిజన సహకార సంస్థ ద్వారా ఈ ఏడాది చింతపండు రూ.32.40 పైసలకు కొనుగోలు చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ వి.కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జరడ గ్రామానికి వెళ్లి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కిలో చింతపండు రూ.32.40 పైసలకు ధర నిర్ణయించినట్లు చెప్పారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజనులు పండించే అన్ని రకాల ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిసిసి అకౌంటెంట్ సాంబశివరావు ఉన్నారు.

తోటపల్లి - కురుపాం రోడ్డుకు మోక్షం

జియ్యమ్మవలస : తోటపల్లి నుండి కురుపాం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు మోక్షం కలిగింది. గుంతల మయంగా మారిన రహదారితో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. గత ఏడాదికే పూర్తి కావాల్సిన రహదారి నిర్మాణ పనులు కాంట్రాక్టరు బిల్లులు అందక అర్ధాంతరంగా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌తో ప్రజల చెంతకు వైద్యం

కొమరాడ : ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా ప్రజలకు వైద్యం మరింత చేరువై, గ్రామ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ బి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు అర్తాంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.శిరీష, పిహెచ్ఎన్ ఎన్.విజయకుమారి, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్

జియమ్మవలస : ఎపిజిబి బ్యాంక్ సర్వర్ లింక్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి బ్యాంక్ సేవలు అందడం లేదని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులు చేసి డబ్బులు పడిన కూలీలు వాటిని డ్రా చేసుకోడానికి వెళ్తే సర్వర్ పనిచేయలేదంటూ నిర్వాహకులు చెప్పడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. అలాగే చిన్నమేరంగి గ్రామీణ బ్యాంకు వద్ద కూడా సర్వర్ పనిచేయలేదంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఖాతాదారులకు అవస్థలు తప్పడం లేదు.

రోడ్డు నాణ్యత పరిశీలన

కురుపాం : తోటపల్లి నుంచి కురుపాం వరకూ జరుగుతున్న రహదారి విస్తరణ పనులను, కురుపాం సమీపంలో జరుగుతున్న గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ సిఇ రమేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నాణ్యత నిర్మాణ పనులను ఆర్అండ్‌బి డిఇ నాగమోహన్‌కు పనులు జరుగుతున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ టీం, ఎఇ నిర్మల, ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కురుపాం : మండల కేంద్రంలో గల శివన్నపేట దగ్గర ఉన్న సోమ సాగారం చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ పి.బావాజీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని, అలాగే తప్పనిసరిగా మస్టర్ హాజరు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇసి డిఎస్ఆర్‌వి మూర్తి, టిఎ సూర్యనారాయణ, ఎఫ్ఎ తాతబాబు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఓపెన్ డే

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చేరిన, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కోర్సులు సౌకర్యాలు సైన్స్ ల్యాబ్ లైబ్రరీ డిజిటల్ తరగతులను చూపించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వి.ప్రభాకరరావు, కో-ఆర్డినేటర్ చంద్రభూషణం, కెమిస్ట్రీ అధ్యాపకులు లలిత కుమారి, శంకర్రావు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌డిఒ

పార్వతీపురంరూరల్ : స్థానిక తహశీల్దారు కార్యాలయాన్ని శుక్రవారం ఆర్‌డిఒ కె.హేమలత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు కార్యాలయంలో నిర్వహణను, పెండింగ్ ఫైళ్లను పరిశీలించి కాలపరిమితి మించకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీ ఇళ్లపట్టాల పంపిణీ గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దారు టివి రమణ తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

బలిజిపేట : మండల కేంద్రంలో గల శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రలఉ శుక్రవారం అందుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, మానసికంగా, ఆరోగ్యంగా క్రీడలు ఎంతో సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో జపాన్ బ్లాక్ బెల్ట్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, జనార్దన్ రావు, రామారావు, వెంకటరమణ , శ్రీనివాసరావ పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా తామరకండి. కొత్తవలస, గెడ్డలుప్పి, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట రైతులు 350 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు లేకపోవడంతో రైతు మొక్కజొన్న, పామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి చెప్తున్నారు. మండలంలో ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ మూతపడిన తర్వాత చెరుకు పంట విస్తీర్ణం తగ్గింది. దీంతో మొక్కజొన్న పంటపై ఆసక్తి కరిగే రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సచివాలయ సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలోని పనుకువలస సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాథులు శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

ద్రవరూప జీవన ఎరువులే సురక్షితం

పాచిపెంట : రైతులు ఎక్కువగా రసాయ ఎరువులను వినియోగించకుండా ద్రవరూప జీవన ఎరువులు వినియోగిస్తే భూసార రక్షణతో పాటు అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాడూరులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలోని పలు సాగుభూములను పరీక్షించగా ఎక్కువగా నత్రజని లోపాలు కనిపించాయన్నారు. భాస్వరం, పొటాష్ స్థాయిలు భూమిలో ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇవి మట్టి పొరల మధ్య బంధింపబడడంతో పంటలకు లభ్యమయ్యే స్థితిలో లేవన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్రవరూప జీవన ఎరువులు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విఎఎలు పాల్గొన్నారు.

ఘనంగా చక్ర తీర్థ స్నానాలు

భామిని : స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి చక్ర తీర్థ స్నానాల కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భామిని పుర వీధుల్లో శివ పార్వతుల విగ్రహాలను పల్లకిలో మేళాతాళాలుతో ఊరేగించారు. అనంతరం వంశధార నదిలో ఆలయ పూజారి రోబి రుణ, ఉమా రుణ విగ్రహాలకు స్నాన మాచరించారు. అనంతరం సాయంత్రం గ్రామ పురోహితులు రంప లలిత ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయం ప్రాంగణంలో శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు.


వంశధారలో స్నానాలు చేస్తున్న భక్తులు

పక్కగా ఇ-క్రాప్ నమోదు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రైతు పండించే పంటలకు ఇ - క్రాప్ నమోదు పక్కగా చేయాల్సిందేనని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని జమదల గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతు పండించే పంటకు సూపర్వైజరీ చెక్‌ను శుక్రవారం నిర్వహించారు. రైతు పండించిన జొన్న పంట వద్దకు వెళ్లి సర్వేనెంబర్‌లోని ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నది, ఇ క్రాప్ నమోదు జరిగిందా లేదా, రైతు వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి రికార్డులోని వివరాలతో సరిచూశారు. రైతు దాసరి ఆదినారాయణను పంట సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో రైతులు చిరుధాన్యాల పంటలు సాగుచేస్తున్నారా, కిట్ల పంపిణీ విషయాలపై మండల వ్యవసాయధికారి ఆర్.రేఖను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు రైతులకు వర్తించేందుకు శత శాతం ఇ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా వ్యవసాయ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ఆర్‌బికె పరిశీలన

మండలంలోని గదబవలస గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎంత మేరకు పొటాషియం, సల్ఫర్, యూరియా పంపిణీ చేసింది పరిశీలించారు. పాడి రైతులకు పంపిణీ చేసే టిఎంఆర్ నిల్వలను పరిశీలించారు. రైతు పండించిన పంటలకు మెళుకువలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శివన్నారాయణ, ఎంపిడిఒ షేక్‌మహమ్మద్ ఆకీబ్ జావేద్, విఎఎ జి.గిరిజ, గ్రామ కార్యదర్శులు, విఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌బికె కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వాటర్ ప్లాంట్ల తనిఖీలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్లను శుక్రవారం విజిలెన్స్ అధికారులు, జిల్లా ఆహార భద్రత అధికారి తనిఖీలు చేశారు. జిల్లా ఆహార భద్రత అధికారి పి.వెంకటరమణ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అప్పలనాయుడు పట్టణంలో డబ్బివీధి, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వాటర్ ప్లాంట్లను పరిశీలించి నీటి నమూనాలు సేకరించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గుర్తింపును వాటర్ ప్లాంట్లు కలిగి ఉండాలని ఆహార భద్రత అధికారి వెంకటరమణ చెప్పారు. సేకరించిన నీటి నమూనాలను నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ కోసం విశాఖలోని ల్యాబ్‌కు పంపిస్తున్నామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతా ప్రమాణాలుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలో మక్కువ, పార్వతీపురంలోని రెండు వాటర్ ప్లాంట్లకు మాత్రమే బిఐఎస్ గుర్తింపు ఉందని చెప్పారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అప్పలనాయుడు మాట్లాడుతూ విజిలెన్స్ ఎస్‌పి ఎం.సురేష్‌బాబు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

కడకళ్లలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల పంచాయతీ కడకెళ్లలో సచివాలయ కార్యదర్శి బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికలు తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీలోని పలు విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక అలజంగి జోగారావు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో కమిషనర్ జె.రామఅప్పల నాయుడుతో కలిసి గృహ నిర్మాణాలు, రహదారులు, కాలువల అభివృద్ధి పనులపై సమీక్షించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. మున్సిపాల్టీ పరిధిలో ఇదివరకే టెండర్లు వేసిన గుత్తేదార్లు టెండర్లకు సంబంధించిన సిసి రోడ్లు, కాలువల నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎవరైతే గుత్తేదారులు సకాలంలో పనులు చేయకపోయినా, ప్రారంభించకపోయినా అటువంటి వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని, కొత్త వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. సమీక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణ, ఇండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పని చేయాలని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్ఆర్ కల్యాణమండపంలో కొత్తగా ఎన్నికైన గృహ సారథులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు, నాయకులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నవరత్నాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తూ, వాటిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం కృషి ఎంతో ఉందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ అభివృద్ధికి బాధ్యతతో పని చేయాలన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మనకు మనమే పోటీ అని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట వేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, జడ్పిటిసి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకువెళ్లాలని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, నియోజకవర్గ వైసిపి పరిశీలకులు డోల జగన్ అన్నారు. మండలంలోని బాలేరులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపైనే ఉందని అన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి, అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నామని అన్నారు. ఇటువంటి పరిస్థితి రాష్ట్రంలో ఎప్పుడైనా ఉందా, అటువంటి ప్రభుతాన్ని గెలిపించే బాధ్యత కన్వీనర్, గృహసారథులపై ఉందని ఎమ్మెల్యే కళావతి తెలిపారు. అనంతరం పార్టీ సంక్షేమ కార్యక్రమాల ప్రచార సామాగ్రిని గృహసారథులకు అందజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల ఇన్‌ఛార్జి కన్వీనర్ కొత్తకోట చంద్రశేఖర్, వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, మాజీ జెడ్‌పిటిసి సోమరాజు గోపాలరావు, సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, కంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న మండల స్థాయి కార్యక్రమం గురువారం స్థానిక గాయిత్రీ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ ఛైర్మన్ రౌతు హనుమంతరావు, ఎంపిపి బొమ్మాలి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్య ప్రకాష్, వాకమూడి అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధరావు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పాలకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

గిరి శిఖర గ్రామాలను సందర్శించిన ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీ పరిధిలో గల గిరిశిఖర గ్రామాలైన కోటకొండ, ఈతమానుగూడ, రాముడుగూడ, డి.అంటిజోల గ్రామాలను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కె.నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి పథకాలు పరిశీలించి సక్రమంగా ప్రజలకు నీరు అందుతుందో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రానున్న వేసవిని దృష్టి ఉంచుకొని ముందస్తుగా తాగునీటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాగునీరు వృథా చేయకుండా సక్రమంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ ఆర్.వేణుగోపాల్, సర్పంచ్ బి.మిన్నారావు, పంచాయితీ కార్యదర్శి బి.చంటి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ పి.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్‌రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను అందజేయాలని, సరెండర్ లీవ్‌లు ఎన్క్యాష్ చేయాలని, ఒకటో తేదీ నాటికి అందరికీ జీతాలు అందజేయాలని, 11వ పిఆర్‌సిల సంబంధాలను తొలగించాలని, 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ అధ్యక్షులు వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, కార్యదర్శి పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాట కార్యక్రమాల్లో భాగంగా స్థానిక తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణకు ఎపిటిఎఫ్ నాయకులు వినతిని అందజేశారు. పాఠశాల విధులు అనంతరం ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి అరకు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా కృష్ణబాబు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధిగా ఎన్.కృష్ణబాబును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపారులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఇదేమి కర్మ ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంలో భాగంగా వాడవాడకు తీసుకెళ్తున్నామన్నారు.

ఎఆర్‌టి మందులు తప్పనిసరి

ప్రజాశక్తి -పార్వతీపురం

హెచ్‌ఐవి బాధితులు ఎఆర్‌టి మందులు తప్పనిసరిగా వాడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు అన్నారు. సేఫ్ కేర్ సెంటర్‌లో శుక్ర వారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవి పాజిటివ్ వచ్చిన వారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని అన్నారు. ఎయిడ్స్ నివారణ చర్యలపై సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు సూచనలు ఇచ్చారు. ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్యాం కుమార్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్‌ఐవి వ్యాప్తి తగ్గిందని అన్నారు. గర్భిణులు తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని , పుట్టే బిడ్డకు వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఎఆర్‌టి వైద్యాధికారి డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ 208 మందికి హెపటైటిస్-బి వాక్సిన్ ఇచ్చామని , ప్రతిరోజూ 20-25 మందికి వాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా సమన్వయ కర్త సాక్షి గోపాల్, నెట్వర్క్ ప్రెసిడెంట్ పద్మ ,లింక్ వర్కర్స్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు సూర్యనారాయణ

స్టోన్ క్రషర్‌లో ప్రమాదం.. కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక బాలాజీ స్టోన్ క్రషర్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఆర్. సూర్య నారాయణ (55) అనే కార్మికుడు మృతి చెందాడు. గరుగుబిల్లి మండలం కొంకిడివరం గ్రామానికి చెందిన ఆర్. సూర్యనారాయణ(55) సుధీర్ఘ కాలంగా క్రషర్ లో పనిచేస్తున్నాడు. లోడింగ్ చేసే చోట యూనిట్ గేజ్ చూస్తున్నారు. రోజు లాగే పని చేస్తుండగా వాహనానికి లోడింగ్ యంత్రం మధ్యలో నలిగి పోవటంతో నేల కూలిపోయాడు. క్రషర్ సిబ్బంది హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని బుడగరాయి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బి.జగదీష్ అనే వ్యక్తిపై బైక్‌పై తరలిస్తున్న పది లీటర్ల సారాను పట్టుకున్నట్టు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటుకు అనుమతివ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తాగునీటి ట్యాంకు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వాసవీ క్లబ్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడును కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్‌ను వాసవీ క్లబ్ అధ్యక్షులు నారాయణం రాజేష్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పెంటపాటి కిరణ్, పట్టణ సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావుతో కలసి పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న శ్రీ భవానీ మాత గుడి వెనుక ఉన్న డివైడర్ పై తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తే రానున్న వేసవిలో స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ తాగునీటి ట్యాంక్ ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

ప్రజాశక్తి - కొమరాడ

ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల రెసిడెన్షియల్ స్కూల్లో మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా శుక్రవారం ఢీకొన్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.జగదీష్ నాయుడు తన సిబ్బందితో పాటు స్థానికుల సహాయంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న లారీ క్యాబిన్ బాగా నుజ్జు కావడంతో క్యాబిన్లో డ్రైవరు ఎన్ గణేష్ ఇరుక్కుపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. గమనించిన పోలీసులు జెసిబి సహాయంతో క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ను బయటకు తీశారు. క్లీనర్‌కు కూడా స్వల్ప గాయాలు కావడంతో ఇద్దర్నీ 108లో పార్వతీపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి రోడ్డుపై ఉన్న లారీలను ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా పోలీసులు తొలగించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లయినా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, దాచుకో దోచుకో అన్నట్టు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కిచ్చాడలో టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఇదేమి కర్మ కార్యక్రమానికి శత్రుచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఈ ప్రభుత్వాన్ని గద్దించి టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టిడిపి నాయకులు చిలక వెంకటరావు, నందివాడ కృష్ణబాబు, రామారావు, సుఖేష్ చంద్ర పండ, జి.చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు వేసినట్లు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ తో కలిసి పట్టణంలోని 12వార్డు గాడివీధి, కర్రి వీధి, జన్ని వీధుల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో వున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమా రావు, ఎఎంసి మాజీ చైర్మన్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీతంపేట : మండలం తాలాడ పంచాయతీ ఉయ్యాల గూడ,బెన్నడు గూడ, సార, తాలాడ, మూర్తికాడ గూడ, లంగడ గూడ, వెంకటి గూడ గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.జయకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పలు సమస్యలు పేరుకుపోయాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్రకార్యదర్శి బిడ్డిక చంద్రరావు, నిమ్మక నాగేశ్వరరావు, చంద్రశేఖర్, సర్పంచ్ బిడ్డిక అప్పారావు, మండంగి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని గోచెక్క పంచాయతీ లిడికి వలసలో, నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్ ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ అభిప్రాయం సేకరించారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి. వెంకటనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దొగ్గమోహనరావు, బోను చంద్రమౌళి, యాండ్రాపు చినరామినాయుడు, జాగాన రవికుమార్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



కురుపాం : కిచ్చాడలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు